ప్రజాశక్తి
మంగళవారం 9 మే 2023 | 5 | విజయనగరం



11న రాజాంలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం

నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈనెల 11న రాజాం నియోజకవర్గ స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జాబ్ మేళా కు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ సోమవారం స్పందన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం రోడ్డులో వరుణ్ షోరూం ఎదురుగా వున్న ప్రభుత్వ ఐటిఐలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ విద్యార్హతలు కలిగిన వారంతా ఈ జాబ్ మేళా కు హాజరు కావచ్చని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఉదయం 9 గంటల నుంచి జాబ్ మేళాకు ధ్రువ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

అట్టహాసంగా మహిళా పార్కు ప్రారంభం

- నగరంలో వేలాది మంది మహిళల ర్యాలీ
- జిల్లా ఖ్యాతి మరింత పెరిగింది : మంత్రి రోజా
- అందరి సమన్వయంతోనే అభివృద్ధి ఫలాలు : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాష్ట్రంలోనే మహిళల కోసం ప్రత్యేకంగా రూ.92.58 లక్షలతో కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా తీర్చిదిద్దిన ప్రకాశం పంతులు మహిళా పార్కు ప్రారంభోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగింది. ఆధునిక వసతులు, స్విమ్మింగ్ పూల్, ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు తదితర సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకొచ్చిన పార్కును రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజా లాంఛనంగా ప్రారంభించారు. రూ.40లక్షలతో నిర్మించిన స్విమ్మింగ్‌పూల్‌ను మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్ బాబు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియం నుంచి మహిళల ర్యాలీ నిర్వహించారు. మంత్రి ఆర్.కె. రోజా, డిప్యూటీ స్పీకర్, జడ్పీ చైర్మన్, ఎంపీ తదితరులు ముందు నడవగా వేలాది మంది మహిళలు వెనుక ర్యాలీగా సాగారు. సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ నిర్వహించిన ప్రదర్శనలు ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ బృందాలు ప్రత్యేక వాయిద్యాలు, గరగ నృత్యాలు, థింసా నృత్యాలతో చూపరులను ఆనందింపజేశారు. అనంతరం అక్కడ రిబ్బన్ కత్తిరించి మంత్రి ఆర్‌కె రోజా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్, జెడ్‌పి చైర్మన్, ఎంపీలతో కలిసి పార్కును ప్రారంభించారు. అనంతరం ఓపెన్ జిమ్, స్విమ్మింగ్ పూల్, పిల్లల ఆట పరికరాలను, హోం థియేటర్లను పరిశీలించారు.



పార్కును ప్రారంభిస్తున్న పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా



ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, మహిళలు

విభిన్న ప్రాజెక్టుల రాకతో జిల్లా ఖ్యాతి మరింత పెరిగింది : రోజా

పార్కు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా మాట్లాడుతూ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని, దీని వల్ల జిల్లా ఖ్యాతి మరింత పెరిగిందని పేర్కొన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, మెడికల్ కాలేజీ, గ్రీన్ ఫీల్డ్ హైవే, ఇతర ప్రాజెక్టులు జిల్లాకు మణిహారంగా నిలుస్తాయని అన్నారు. సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటుందని పేర్కొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి : కోలగట్ల

ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో, సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సురేష్ బాబు, వరుదు కల్యాణి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, నగర మేయర్ విజయలక్ష్మి, ఉప మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపురేవతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'జగనన్నకు చెబుదాం'

ప్రతి అర్జీని పరిష్కరించాలి : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

స్పందన కార్యక్రమంలో అందజేసే వినతులను పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ప్రభుత్వ స్థాయిలో ఆయా అర్జీలను పరిష్కరించగలిగే స్థాయి వరకు దానిని పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. జిల్లాలో పురపాలక, రెవిన్యూ, పోలీసు, గృహనిర్మాణ, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్, సచివాలయ సేవలు వంటి కొన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన వినతులు అధికంగా వస్తున్నాయని, ఆయా శాఖల అధికారులు వినతుల పరిష్కారంపై అధికంగా దృష్టి సారించాలని సూచించారు. సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు వర్గాల ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ 167 వినతులను అందజేశారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 115 వినతులు, గ్రామ వార్డు సచివాలయం సేవలపై 15, గృహ నిర్మాణంపై 15 వినతులు అందాయి.

గత రెండు నెలల్లో వివిధ శాఖల ద్వారా సంతృప్తికరంగా పరిష్కారం కాని వినతులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా మున్సిపల్ ప్రణాళికా విభాగంలో వినతుల పరిష్కారంపై అసంతృప్తి వ్యక్తంచేస్తూ అధికంగా వస్తున్నాయని, వీటిపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడుకు కలెక్టర్ సూచించారు.



స్పందనలో సమస్యలు వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి

16న పారిశుధ్య కార్యక్రమాలు

జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని మే 16వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయాల స్థాయిల్లో నిర్వహించి దోమల నిర్మూలనకు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇంటిలోనూ శుక్రవారం డ్రై డేగా పాటించేలా ప్రజలకు అవగాహన కలిగించాలని అధికారులకు సూచించారు. జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి మాట్లాడుతూ ప్రతి ఏటా మే నుంచి సెప్టెంబరు నెలల్లో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం వుంటుందని ఇళ్లలో నీరు నిల్వ వుండకుండా చేయడం వల్ల దోమల నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు.

మధ్యాహ్న భోజన పథకం బకాయిలు చెల్లించాలి

ప్రభుత్వం బకాయి ఉన్న మధ్యాహ్న భోజన పథకం బిల్లులు 2018 జూన్ 30 నుండి డిసెంబరు (ఇంటర్ విద్యార్థుల భోజన బిల్లు) వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతి అందజేశారు. నెల్లిమర్ల మండలం సతివాడలోని ఎపి మోడల్ స్కూల్ మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు చెల్లించాల్సిన బకాయిలు నేటికీ చెల్లించలేదని అన్నారు. రూ.80,401 బిల్లును వెంటనే వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి అందజేసిన వారిలో భోజన నిర్వాహకులు ఉన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్రం ప్రభుత్వం అనుసరిస్తున్న వేధింపుల ధోరణిని ఆపాలని ఎపి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఉద్యమకార్యాచరణ మూడోదశలో భాగంగా సోమవారం జిల్లా కలక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అమరావతి జెఎసి చేస్తున్న డిమాండ్ల పరిష్కారంతో పాటు ఇటీవల జిల్లాలో ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమకేసులను ఎత్తివేయాలని కోరుతూ రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి వినతిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎపిజెఎసి అమరావతి తలపెట్టిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై చేపట్టిన మూడవ దశ ఉద్యమ కార్యాచరణ పార్వతీపురం మన్యం జిల్లా వేదికగా ఉధృతం చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి శ్రీకాకుళంలో ప్రాంతీయ సదస్సు నిర్వహించి తదుపరి కార్యాచరణకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈఏడాది పదో తరగతి ఫలితాల్లో కొత్తజిల్లా అయిన పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల కృషితో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిపారని, అంకితభావంతో పనిచేసిన వారిని ప్రిన్సిపల్ కార్యదర్శి స్థాయి అధికారి తనిఖీల పేరిట, స్వల్ప కారణాలతో విధుల నుంచి తొలగించి, వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారని అన్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులను వేధిస్తూ వారితో బోధనేతర పనులు చేయిస్తున్నారని, దీనివల్ల వారి ఆత్మాభిమానం దెబ్బతింటుందని, తద్వారా ఆప్రభావం విద్యార్థుల బోధనపై పడి వారి జీవితాలపై ప్రభావం చూపిస్తుందని అన్నారు. తమకు రావాల్సిన డిఎలు, తదితర బకాయిలు, ముఖ్యమంత్రి ఎన్నికల ముందు వాగ్దానం చేసిన సిపిఎస్ రద్దు వంటి న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం గొంతెత్తితే వారిపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1650 అక్రమ పోలీసుకేసులు పెట్టి వారిని వేధిస్తున్నారని అన్నారు. మూడో దశ ఉద్యమ కార్యాచరణకు రాష్ట్రంలోని అన్ని వర్గాలు కలిసి రావాలని, తమకు మద్దతుగా నిలబడాలని కోరారు.

ఉపాధ్యాయులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

ఉపాధ్యాయులపై అక్రమముగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని మరియు ఉద్యోగపరంగా వారికున్న సమస్యలను పరిష్కరించాలని ఎపిజెఎసి, అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, వివిధ ఉపాధ్యాయ సంఘాలు కలెక్టర్‌కు వినతిని అందజేశారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలో భాగంగా మన్యం జిల్లా డిఇఒ, జిసిడిఒ, వీరఘట్టం ఎంఇఒ, కెజిబివి స్పెషల్ ఆఫీసర్లను అక్రమంగా సస్పెన్షన్లకు గురి చేశారన్నారు. డిఇఒ, జిసిడిఒలపై సస్పెన్షన్ ఎత్తివేశారని, అలాగే ఎంఇఒ, కెజిబివి స్పెషలాఫీసర్ల సస్పెన్షన్ కూడా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను పాఠాలు బోధించే పనులకు కాకుండా నానా రకాల యాప్‌ల పని భారం కల్పిస్తూ, నాడు-నేడు పనుల పర్యవేక్షణ కూడా ఉపాధ్యాయులకు అప్పగించడం, మరుగుదొడ్ల పరిశుభ్రత, నిర్వహణ పనులతో పాటు పాఠశాల వాచ్‌మేన్ పని కూడా ఉపాధ్యాయులతో చేయించడం ఎంతో దుర్మార్గమని అన్నారు. ఇటువంటి పనుల వల్ల ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాధింపులు మానుకొని, నేటి వరకు ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను, అక్రమ సస్పెన్షన్లను మరియు వేధింపులను నిలిపివేయాలని రాష్ట్రంలో గల 26 జిల్లాలలో కలెక్టర్లకు ఎపి జెఎసి అమరావతి వినతి పత్రం అందజేసిందన్నారు. కార్యక్రమంలో ఆసంఘం అసోషియేట్ చైర్మన్ టివి ఫణి పేర్రాజు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామెదరరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గొట్టాపు శ్రీరామమూర్తి, డిజిప్రసాద్, అసోసియేట్ చైర్మన్ మరిపి శ్రీనివాస రావు, వైస్ చైర్మన్లు జి.చంద్ర మౌళి, ఆర్.రమణమూర్తి, నారాయణరావు, హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు ఎన్‌జిఒ అధ్యక్షులు జివిఆర్‌ఎస్ కిశోర్, సిఐటియు నాయకులు వి.ఇందిర, గొర్లి వెంకటరమణ, విశ్రాంత ఉద్యోగులు అంటిపేట సత్యనారాయణ, గొర్లె అప్పలరాజు, పలు ఉపాధ్యాయసంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎస్‌పి ఎం.దీపిక

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఎస్‌పి ఎం.దీపిక పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించి, ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే వాటి పరిష్కారానికి సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఎస్‌సి,ఎస్‌టి సెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, సిఐలు జె.మురళి, జి.రాంబాబు, ఇ .నర్సింహ మూర్తి, 1వ పట్టణ సిఐ బి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు మొబైల్స్ అందజేత

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 34 మొబైల్ ఫోన్లను బాధితులను ఎస్‌పి ఎం.దీపిక సోమవారం అందజేశారు. పోగొట్టుకున్న మొబైల్స్ ను చాలా తక్కువ వ్యవధిలోనే తిరిగి తమకు అప్పగించిన ఎస్‌పికి బాధితులంతా కృతజ్ఞతలు తెలిపారు. సైబర్ సెల్ ఎస్‌ఐ ప్రశాంత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల బాలికల వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం

విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తాహశీల్దార్ ఆఫీసు ప్రక్కన నిర్వహిస్తున్న వికలాంగ బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆశాఖ సహాయ సంచాలకులు జివిబి జగదీష్ తెలిపారు. ఈ వసతి గృహంలో మొత్తం 100మంది విద్యార్థినులకు గాను 71 మంది విద్యార్థినులు వసతి పొందేందుకు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. 1 వ తరగతి నుండి 10వ తరగతి, ఇంటర్ ఆపై చదువులు చదువుతున్నవారికి ఉచిత భోజనము మరియు వసతితో పాటు కాస్మోటిక్ చార్జీలు, యూనిఫారము, నోట్ బుక్స్ , ఇతర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు వికలాంగ ధ్రువీకరణతో పాటు కుల, ఆదాయ , నివాస పత్రం , ఏదైనా పాఠశాల లో చదివితే బదిలీ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ దీసుకొని రావాలని సూచించారు. వివరాలకు 9100685216, 9494593926 ద్వారా మేట్రిన్‌ను సంప్రదించాలని తెలిపారు.

మినిమం టైం స్కేల్ పద్ధతిలో జీతాలు చెల్లించాలి

యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి

ప్రజాశక్తి-వీరఘట్టం

రాష్ట్రంలో కెజిబివిల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేలు వర్తింపజేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయ గౌరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రేగులపాడు కెజిబివిని సందర్శించిన సందర్భంగా విలేకరులతో మాట్లా డారు. ప్రభుత్వం కెజిబివిల అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించాలన్నారు. ఉద్యోగ భద్రత, రెగ్యులర్లైజేషన్, మినిమం టైం స్కేల్ పద్ధతిలో జీతాలు చెల్లించేందుకు గతంలో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించకపోయినా విద్యార్థులకు మంచి గైడెన్స్ ఇచ్చి చదివించడం వల్లే ఫలితాలు వచ్చాయని న్నారు. ప్రభుత్వము పుస్తకాలు ఆలస్యంగా ఇచ్చినా ఉపాధ్యాయులు అక్కడ ఇక్కడ సంపాదించి సిలబస్ పూర్తి చేసి పరీక్షలకు సిద్ధం చేశారని అన్నారు. పుస్తకాలు ఇవ్వలేదనే సాకుతో అన్యాయంగా వీరఘట్టం కెజిబివిని ఎస్‌ఒను సస్పెండ్ చేశారని అన్నారు. పాఠశాల నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిందని, ఇప్పుడు రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఏమంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల వైపు నుండి ఉన్న తప్పిదాలను ఉపాధ్యాయులపై ఆపాదించి అభద్రతకు గురి చేయడం సరికాదని, ఎస్‌ఒ సస్పెన్షన్ తక్షణమే ఎత్తివేయాలని కోరారు. పాఠశాల చుట్టూ రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు ఐ.రాజమణి, జిల్లా కార్యదర్శి కె.గోవిందమ్మ, ఎం.పైడిరాజు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధిని అడ్డుకుంటున్నారు

సెటిలర్లపై డిప్యూటీ సిఎం ధ్వజం

ప్రజాశక్తి-సాలూరు

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన అభివృద్ధి పనులను సెటిలర్లు అడ్డుకుంటున్నారని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని కొట్టుపరువు గ్రామంలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్సింహులు ఆధ్వర్యాన గిరిజనులు రోడ్డు సమస్య గురించి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో రోడ్లు, వంతెనలు నిర్మిస్తే గిరిజనుల కంటె కమ్మ,రెడ్డి భూస్వాములకే ఎక్కువ మేలని చెప్పారు. వారు పండించే వ్యవసాయ ఉత్పత్తుల రవాణా s రోడ్లు ఎక్కువ గా ఉపయోగపడుతున్నాయని చెప్పారు. పామాయిల్, మొక్కజొన్న,అరటి పంటల రవాణా వల్ల తరచూ రోడ్లు పాడవుతున్నాయని తెలిపారు. పాడైన రోడ్లు బాగు కోసం కనీసం గోతులు కూడా కప్పించే ప్రయత్నం చేయడం లేదన్నారు. గిరిజనుల భూములు కొనుగోలు చేసుకుని వారినే వ్యవసాయ కూలీలుగా ఉపయోగించుకుంటున్న భూస్వాములు అభివృద్ధి పనులు అడ్డుకోవడం దారుణమని అన్నారు. కొట్టుపరువు గ్రామానికి రోడ్డు నిర్మాణానికి నాలుగు అడుగుల భూమి ఇవ్వమంటే కృష్ణ కిశోర్ అనే భూస్వామి అడ్డుకుంటున్నారని అన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి-విజయనగరం

విభిన్న ప్రతిభా వంతుల కోసం ప్రభుత్వం అందించే పథకాలు వినియోగించు కొని స్వశక్తితో జీవించేందుకు ప్రయత్నించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. జిల్లాలోని విభిన్న ప్రతిభా వంతులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన లాప్ టాప్ లు, టచ్ ఫోన్లను కలెక్టర్ సోమవారం స్పందన కార్యక్రమంలో అందజేశారు. జిల్లాలోని పిజి విద్యార్హతలు కలిగిన 13 మంది విభిన్న ప్రతిభావంతులకు ఒక్కొక్కరికి రూ.40వేలు విలువ కలిగిన లాప్ టాప్ లు అందజేశారు. ఇంటర్ విద్యార్హత కలిగిన నలుగురికి రూ.15,000 విలువ కలిగిన టచ్ ఫోన్లను అందజేశారు. జాయింట్ కలెక్టర్ శ్రీ మయూర్ అశోక్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి జగదీష్ తదితరులు పాల్గొన్నారు



ల్యాప్‌టాప్ అందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -విజయనగరం కోట

సమ్మర్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ అన్నారు. సోమవారం స్థానిక గాజులరేగ శాఖా గ్రంథాలయంలో 55 జాతీయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని శాఖ లైబ్రేరియన్ ఎం. లక్ష్మణరావు ఆధ్వర్యంలో చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆదినారాయణ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న శిక్షణ శిబిరాన్ని పిల్లలు వినియోగించుకోవచ్చని తెలిపారు శిక్షణ శిబిరంలో మానసిక ఉల్లాసాన్ని అందించడానికి కూడా కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు శిక్షణ శిబిరం మంచి అవకాశం అని తెలిపారు. కార్యక్రమంలో సుమారుగా 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి చూపాలి

- ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లాకు మంచిపేరు తేవాలి
- జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అంతా సిద్ధంకావాలి
- అధికారులకు మంత్రి బొత్స సూచన

ప్రజాశక్తి-విజయనగరం

వివిధ సమస్యలపై ప్రజలు అందించే వినతుల పరిష్కారంపై చిత్తశుద్ధితో వ్యవహరించాల్సి వుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. జిల్లాలో ఎలాంటి ప్రజాసమస్య వున్నా అధికారులు వెంటనే స్పందించి వాటికి తగిన పరిష్కారం ఆలోచించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం, తుఫానుపై అప్రమత్తతపై సమీక్షించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారాన్ని నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షణ చేస్తుందని, అందువల్ల ప్రతి వినతిని శ్రద్ధతో పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఫిర్యాదులు వస్తున్నాయని, వారంతా కొత్తగా ఉద్యోగంలో చేరినందున వారికి తగిన కౌన్సిలింగ్ చేసి పనితీరు మెరుగుపరచుకొనేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనికేషన్ సంబంధాలు పెరిగినందున ఫోన్ ద్వారానే ఎన్నో సమస్యలు పరిష్కరించే అవకాశం ఉందన్నారు. గత రెండు మూడేళ్లలో అందిన వినతులను ఆడిటింగ్ చేసి శాఖల వారీగా, అంశాల వారీగా విశ్లేషించినపుడు పలు అంశాల్లో అత్యధికంగా వినతులు వచ్చాయని, వాటిపై శ్రద్ధ చూపాలని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

జిల్లాలో పంటనష్టం లేదు

ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. క్షేత్రస్థాయి నుంచి వ్యవసాయ, ఉద్యాన అధికారులతో పంటనష్టంపై నివేదికలు అందిన మీదట ఈ విషయం చెబుతున్నట్టు పేర్కొన్నారు. వచ్చే రెండు మూడు రోజుల్లో తుఫాను ప్రభావం వుండొచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినందున అధికారులు అప్రమత్తంగా వుండాలని మంత్రి సూచించారు. సమావేశంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రత్యేక అధికారి, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, జిల్లా ప్రత్యేక అధికారి, పాఠశాల విద్య కమిషనర్ సురేష్ కుమార్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ గణపతిరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐదు కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలోని పలు కళాశాలల్లో ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్ కోర్సుల్లో 2023-24 సంవత్సరంలో ప్రవేశానికి గాను నిర్వహించే పరీక్షలను జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. జిల్లాలో మే 15 నుంచి జూన్ 20 వరకు వివిధ దశల్లో ఈ పరీక్షలను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆయా ప్రవేశ పరీక్షల నిర్వహణపై పలు శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. విజయనగరంలోని ఎంవిజిఆర్, లెండి, సీతం ఇంజనీరింగ్ కళాశాలల్లోనూ, రాజాంలో జిఎంఆర్ఐటి లోనూ, బొబ్బిలిలో స్వామి వివేకానంద ఇంజినీరింగ్ కళాశాలలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డిఆర్‌ఒ గణపతిరావు

ఎపిఇఎపి సెట్(ఇంజనీరింగ్) 9 మే 15 నుండి 19 వరకు సెషన్లలో జరుగు తుందన్నారు. ఎపిఇఎపి సెట్(అగ్రికల్చర్, ఫార్మసీ) పరీక్ష మే 22, 23 తేదీల్లో 4 సెషన్లలో జరుగు తుందన్నారు. ఎపిఐసెట్ 3 సెషన్లలో మే 24, 25 తేదీల్లో ఉదయం 9 నుండి 11.30 గంటల వరకు జరుగుతుందన్నారు. లాసెట్, పిజిఎల్‌సెట్ మే 20న ఒక సెషన్‌లో మధ్యాహ్నం 3 నుండి 4.30 వరకు జరుగుతాయన్నారు. ఎపిపిజిఇసెట్ మే 28 నుంచి 30వ తేదీ వరకు 6సెషన్లలో జరుగు తుందని, ఉదయం 10 నుంచి 12, మధ్యాహ్నం 3 నుంచి 5 వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.ఎపిపిజిసెట్ జూన్ 6 నుంచి 10 వరకు 15 సెషన్లలో జరుగుతుందని, ఉదయం 9-11.30, 1.00 - 2.30, 4.30 - 6.00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఎడ్‌సెట్ జూన్ 14న ఒకే సెషన్‌లో ఉదయం 9 నుంచి 11 వరకు వుంటుందన్నారు. ఎపిఇసెట్ జూన్ 20న రెండు సెషన్లలో ఉదయం 9 -12, మధ్యాహ్నం 3 నుంచి 6గంటలు వరకు జరుగుతుందని తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఒపిఎస్‌ను అమలు చేయాలి

నెల్లిమర్ల: ఉద్యోగులకు పాత పద్ధతిలో పెన్షన్ అమలు చేయాలని ఎపి జెఎసి అమరావతి యూనియన్ జిల్లా అధ్యక్షులు కె. రమణ రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎపి జెఎసి అమరావతి యూనియన్ పోరాటం చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి పాత పద్ధతిలో పింఛన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిల వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు ఎపి జెఎసి అమరావతి యూనియన్ పోరాటం చేస్తుందని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

బొబ్బిలి: పట్టణ పరిధిలో మల్లంపేటలో అక్రమంగా నిల్వ చేసిన 15 క్వింటాళ్ల బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. మల్లంపేటలో వ్యాపారి ఉన్న రమణమూర్తి ఇంటిలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందడంతో పౌర సరఫరాల ఉప తహశీల్దార్ సాయికృష్ణతో కలిసి విజిలెన్స్ సిఐ బి.సింహాచలం, సిబ్బంది దాడి చేసి అక్రమంగా నిల్వ చేసిన 15క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం రేషన్ షాపును, రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండియు వాహనాన్ని తనిఖీ చేశారు. లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ బియ్యం అందజేయాలని డీలర్ కు, ఎండియు ఆపరేటర్‌కు ఆదేశించారు. రేషన్ సరుకులు పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సహారా యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పూజిత

బొబ్బిలి: సహారా కస్టమర్లను మోసం చేసిన సహారా ఇండియా యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని సహారా ఏజెంట్లు, కస్టమర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పూజిత డిమాండ్ చేశారు. సహారా కస్టమర్లకు డిపాజిట్ సొమ్ము చెల్లించాలని కోరుతూ సోమవారం సంస్థానం పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం సహారాలో దాచుకున్న డిపాజిట్ సొమ్మును యాజమాన్యం స్వాహా చేసిందన్నారు. ప్రజల సొమ్మును స్వాహా చేసిన యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కస్టమర్లకు న్యాయం చేయాలని కోరారు. కోర్టుతో సంబంధం లేకుండా డిపాజిట్లు చెల్లించాలన్నారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బొబ్బిలి నాయకులు బిఎల్ దాసు, పాల్గొన్నారు.

మణికంఠ రాథోడ్ పై కఠిన చర్యలు

బొబ్బిలి: ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను, కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరిస్తున్న కర్ణాటక రాష్ట్రంలోని చిత్తాపూర్ బిజెపి అభ్యర్థి మణికంఠ రాథోడ్ పై కఠిన చర్యలు తీసుకోవాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు కోరారు. మణికంఠ రాథోడ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం డిఎస్‌పి బి.మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మువ్వల శ్రీనివాసరావు మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆదరణ పెరగడంతో ఇటువంటి బెదిరింపులు చేస్తున్నారన్నారు. హత్యా రాజకీయాలకు కాంగ్రెస్ భయపడదన్నారు. చంపేస్తామని బెదిరిస్తున్న మణికంఠ రాథోడ్ ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

కరాటే ఛాంపియన్‌షిప్‌లో పతకాల పంట


పతకాలు సాధించిన క్రీడాకారులు

కొత్తవలస: అనకాపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన 14వ కేన్యూరా కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక విద్యార్థులు పది మంది పాల్గొని ప్రతిభ కనబరిచారు. కుమిటి, కాటా విభాగాల్లో ఏదుబిల్లి దేవకీలత రెండు కాంస్య పతకాలు, ఏదుబిల్లి శ్రీలక్ష్మీప్రసన్న రజిత,కాంస్య పతకాలు, కర్రి జయశ్రీ రజిత, కాంస్య, గొల్లపల్లి దినేష్ కాంస్య, ఆబోతు సుశాంత్ రోషన్ రజిత, పల్ల రోహిత్ సాయి కృష్ణ రజిత, కాంస్య పతకాలు సాధించారు. వీరిని వీరిని కోచ్ సూర్య నూకరాజు అభినందించారు.

రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలి

గజపతినగరం: గజపతినగరం, పోరలి గ్రామాల మధ్య వేస్తున్న రోడ్డు పనులను వేగవంతం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చలుమూరి వెంకటరావు డిమాండ్ చేశారు. సోమవారం డివైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆఫీస్‌లో డిప్యూటీ కలెక్టర్‌కు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని వినతిపత్రం అందించారు. నాయుడు మాట్లాడుతూ రోడ్డు మంజూరై రెండు నెలలైనప్పటికీ పనులు మాత్రం నత్త నడకన సాగుతున్నాయన్నారు. దీనివల్ల 10 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పాటూరు రోడ్డు పనులు జరుగుతున్న సందర్భంలో భద్రత చర్యలు చేపట్టాలని రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు రామచంద్ర పాల్గొన్నారు.

సింగుబాబు మరణం పార్టీకి తీరని లోటు

నెల్లిమర్ల: టిడిపి నాయకులు, మాజీ జెడ్‌పిటిసి దంతులూరి శంకర సీతారామరాజు(సింగుబాబు) మరణం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడ గ్రామంలో సింగుబాబు పెద్దకర్మ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. సింగుబాబు లాంటి వ్యక్తులు పార్టీని వీడిపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, జిల్లా టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ రావు, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు లెంక అప్పలనాయుడు, డెంకాడ మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, అవనాపు సత్యనారాయణ, నల్లం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

రేగిడి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్ కింద ఊపి ప్రారంభించారు. మండలంలోని 39 గ్రామపంచాయతీలో 66 గ్రామాలకు సంబంధించి తాగునీటి ఇబ్బందులు లేకుండా కృషి చేయాలన్నారు. బోర్లు మరమ్మతులు జరిగితే తక్షణమే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి బాగు చేయాలన్నారు. ఫిర్యాదులపై స్పందించి తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీచరణ్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం నుంచి బోర్ మరమ్మత్తుల పార్ట్స్ వచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లో గుర్తించిన బోరు మరమ్మతులు చేసి తాగునీరు అందిస్తామన్నారు. ఇప్పటికే జలజీవన్ మిషన్ ద్వారా అనేక గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథ రావు, మండల జెఇ రామకృష్ణారావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన విద్యా కానుక


మండల కేంద్రానికి చేరుకున్న పుస్తకాలు

రేగిడి: స్థానిక మండల రిసోర్స్ కార్యాలయానికి సోమవారం జగనన్న విద్యా కానుకులు చేరాయి. ఇందులో భాగంగా మండలంలో అన్ని పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్స్, వైట్ బుక్స్ బ్రాడ్ రోల్డ్ బుక్స్, రూల్ బుక్స్, గ్రాఫ్ బుక్స్ వచ్చినట్లు ఎంఇఒ ఎం వరప్రసాదరావు తెలిపారు. మండలంలో అన్ని పాఠశాలలో కలిపి 37,856 నోట్, 19853 టెస్ట్ పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. ఈ జగనన్న విద్యా కానుకలు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలలకు రేగిడి ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థుల హాజర్ బట్టి తీసుకువెళ్లాలని కోరారు. వీరితో పాటు క్వాలిటీ అబ్జర్వర్ ఎపిఎం మంగమ్మ, ఎమ్మార్సీ సిబ్బంది, సిఆర్‌పిలు, పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్లు తదితరులు ఉన్నారు.

ప్రజలకేం కావాలో అదే చేస్తాం...

● గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ ● రూ.2 కోట్ల అంచనాతో గరివిడి - బొప్పడాం రోడ్డు పనులకు శంకుస్థాపన


ప్రజాశక్తి- గరివిడి

పేద ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అటు అభివృద్ధికి, ఇటు సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం చిరునామాగా నిలుస్తుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి వారికేం కావాలో అవి అందజేస్తున్నామని గుర్తు చేశారు. మండలంలోని దువ్వాం గ్రామంలో సోమవారం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం, రోడ్డు పనులకు శంకుస్థాపనల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. దీనిలో భాగంగా ముందుగా రూ.2 కోట్ల అంచనాతో నిర్మించనున్న గరివిడి - బొప్పడాం రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో సేరిపేట, దువ్వాం గ్రామాలకు అంతర్గత రోడ్ల నిమిత్తం మరొక రూ.20 లక్షలు కేటాయిస్తూ ప్రకటన చేశారు.


గరివిడి: దువ్వాంలో పర్యటిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

దువ్వాంలో ఏర్పాటు చేసిన గడప గడపకు - మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి బొత్స పలు అంశాలపై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై, చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలను ఆరా తీశారు. సేవల అందుతున్న తీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బందిని వేదిక ముందుకు పిలిచి వారు అందిస్తున్న సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ప్రజల నుంచి కొన్ని విజ్ఞప్తులు రాగా మంత్రి స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్మశాన వాటిక నిమిత్తం పంట భూములు పోతున్నాయని కొందరు మంత్రి దృష్టికి తీసుకురాగా.. భూములు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయం చూపాలని స్థానిక రెవెన్యూ అధికారులకు సూచించారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న జగనన్నకు చెబుదాం ప్రజలు కష్టాలు, ఇతర సమస్యలు చెప్పుకునేందుకు ఓ చక్కని వేదిక అని మంత్రి చెప్పారు. దీని ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. మండలంలోని ఒంపల్లి, బిళ్లలవలస గ్రామాల్లో సర్పంచులు ఎండ నారాయణమ్మ, నెట్టి ఏసురత్నం ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే ఆరా తీశారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, ఎంపిపి చల్లచలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, ప్రభూజీ, గొల్లు సతీష్‌కుమార్, మహంతి రమణ తదితరులు పాల్గొన్నారు.


డెంకాడ: బ్రోచర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మోపాడలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కోసం అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి వివిధ రకాల పథకాలు అందిస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవ రావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, తహశీల్దార్ పి. ఆదిలక్ష్మి, ఇఒపిఆర్‌డి ఎన్ అప్పలనాయుడు, సర్పంచ్ బడ్డుకొండ రమేష్ నాయుడు, పినతడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, నాయకులు, కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- వేపాడ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. వేపాడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. శ్రీవల్లి, సిఆర్‌పి వెంకటలక్ష్మి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం లైబ్రేరియన్ సోమునాయుడు సమ్మర్ క్యాంప్ కార్యక్రమ వివరాలను విద్యార్థులకు తెలియజేశారు.

గుర్ల: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం జెడ్‌పిటిసి శీర అప్పల నాయుడు, డిఎల్‌డిఎ ఛైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, వైస్ ఎంపిపి తిరుపతి రావు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడులు ప్రారంభించారు. జెడ్‌పిటిసి మాట్లాడుతూ విద్యార్థులు ఈ సమ్మర్ కాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో కథల పుస్తకాలు, ఇతిహాసాలు, శతకాలు, చదవాలన్నారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఎ ఛైర్మన్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు చదువుపై దృష్టిని సారించేందుకు ప్రభుత్వం మంచి కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. మే 8 నుండి జూన్ 11వ తేదీవరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ భాను ప్రకాష్, శాఖా గ్రంథాలయం అధికారి రామారావు, స్థానిక పెద్దలు ప్రసాద్, సీతారాం, వెంకటరమణ, ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గుర్ల: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

డెంకాడ : గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సర్పంచ్ గౌరీ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని ఆమె ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాయుడుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులు పాటు గ్రంథాలయంలో విజ్ఞానాన్ని పెంపొందించే వివిధ పుస్తకాలను అందుబాటులో ఉంచుతారన్నారు. అనంతరం లైబ్రేరియన్ మహేష్ వేసవి శిక్షణ శిబిరంలో పుస్తకాలు గురించి వివరించారు.

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని పంచాయతీ విస్తరణాధికారి సూర్యనారాయణ, ఎంఇఒ కృష్ణమూర్తి, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్రినాథరావు ప్రారంభించారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరం ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియచేసారు. అనంతరం శిబిరానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిబాబు, కొల్లి ఈశ్వరావు, సంధ్య, రహీమ్, గ్రంథాలయాధికారి దుర్గాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

గంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉప సర్పంచ్ కృష్ణంరాజు కోరారు. సోమవారం ఆయన గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి రాంభద్ర రాజు పాల్గొన్నారు.


రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న డిఇఇ

తాగునీటి సమస్య పరిష్కారం

వేపాడ: మండలంలోని నల్లబెల్లి జగనన్న లేఅవుట్‌లో తాగునీటి సమస్యను ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ కె. పైడిరాజు పరిష్కరించారు. సోమవారం తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన మోటారును ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దీంతో ఆ కాలనీలో తాగునీటి సమస్య ఉండదని ఆయన చెప్పారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ కామేష్, గ్రామ పెద్ద చిరంజీవి పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వ్రతాలు

నెల్లిమర్ల: మండలంలోని కొత్తపేట సమీపం, రామతీర్థం రోడ్డు వద్ద శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో సామూహిక వ్రతాలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. పండితులు రంపా కోదండ రామశర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రంలో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వ్రతం చేయించుకున్న భక్తులకు స్వామివారి ఫోటో, ప్రతిమ, ప్రసాదం అందజేశారు. తదుపరి భక్తులందరికీ అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొండేటి సురేష్, నెల్లిమర్ల నియోజవర్గ టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు, కొత్తపేట సర్పంచ్ అట్టాడ శ్రీను, మాజీ సర్పంచ్ గురాన అసిరి నాయుడు, నాయకులు గేదెల రాజారావు లెంక అప్పలనాయుడు , నల్లం శ్రీను, పోతల రాజప్పన్న, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - రామభద్రపురం

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్లు అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ బిక్షాటన చేశారు. సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టిడించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ గత18 నెలలు నుండి బకాయి ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. 2020లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల వేతనం అమలు చేయాలన్నారు. కార్మికులకు భద్రత పరికరాలు ఇచ్చి ఇతర సమస్యలు పరిష్కరించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని నినదించారు. బల్ల రిక్షాల మదుపు ప్రభుత్వమే ఇవ్వాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలనీ, ప్రమాద బీమా రూ.20 లక్షల వరకు కల్పించాలని కోరారు. కార్మికులు మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. బకాయి ఉన్న జీతాలు వెంటనే చెల్లించకపోతే ఎంపిడిఒ ఆఫీసు ముందు రిలే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు కృష్ణ, వెలగాడ సింహాచలం, పట్టింగ తౌడు, భవాని, చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.


సమస్యను అధికారికి వివరిస్తున్న సిఐటియు నాయకులు

నాడు నేడు పనులు పరిశీలన

వేపాడ : మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెండో విడుత నాడు నేడు పనులు చురుగ్గా సాగుతున్నాయి. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం రెండో విడత మంజూరైన నిధులతో చేపట్టిన పనులను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వల్లి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. లోపాలున్నట్లు తన దృష్టికి వస్తే బిల్లులు చెల్లించమని హెచ్చరించారు. ఈ పరిశీలనలో ప్రధానోపాధ్యాయురాలతో పాటు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, సిఆర్‌పి లక్ష్మీ పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న హెచ్‌ఎం వల్లి


మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

నిర్మాణాలు వేగవంతం

బొబ్బిలి: జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ శ్రీనివాసరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జగనన్న ఇళ్ల నిర్మాణాలపై గృహ నిర్మాణ అర్బన్ డిఇ రత్నాకర్, ఎఇ అల్లు సూర్యనారాయణతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం జగనన్న ఇళ్లను మంజూరు చేసిందన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి పేదల సొంతింటి కలను నిజం చేయాలని కోరారు. ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులను గుర్తించి నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు కోసం మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు సంపూర్ణంగా సహకరిస్తారని చెప్పారు.

కార్యదర్శిపై ఎంపిడిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

లక్కవరపుకోట ప్రజాశక్తి విలేకరి పి. శ్రీనివాసరాజుపై ఎల్ కోట కార్యదర్శి రమణ సోమవారం చిందులేశారు. గత నెల 19న జరిగిన సర్వసభ్య సమావేశంలో జరిగిన పరిణామాలపై 'పార్టీ మీటింగా..? సర్వసభ్య సమావేశమా..?' అనే శీర్షికతో వార్తను ప్రజాశక్తిలో ప్రచురించిన విషయం తెలిసిందే. వార్తలో ఉన్న సారాంశం ప్రకారం ఎల్ కోట కార్యదర్శి రమణ ఏ పనికైనా లంచం గుంజుతున్నాడని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా విధులు సక్రమంగా నిర్వర్తించలేదని, ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వర్తించలేదని, పంచాయతీ సమావేశాలకు హాజరవట్లేదనేటువంటి 8 అంశాలపై ఎంపిపి శ్రీనివాసరావు, ఎంపిడిఒ జ్ఞానేశ్వరావులు అతనిపై చర్యలు కోసం గత నెల 24న తీర్మానించారు. ఇందుకు సంబంధించి ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తలకు కార్యదర్శి స్పందిస్తూ 'నన్ను అడగకుండా వార్తలు రాస్తావా..? వార్తలు రాసేటప్పుడు నన్ను అడగాలి కదా..? వాళ్లెవరు చెప్పడానికి..?' అంటూ సర్వసభ్య సమావేశాన్ని అగౌరవపరిచే విధంగా ప్రజాశక్తి విలేకరితో చరవాణిలో సోమవారం మాట్లాడారు. ఈ మేరకు మనస్థాపానికి గురైన విలేఖరి ఎంపిడిఒ జ్ఞానేశ్వరావుకు లికిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యదర్శి రమణ వ్యవహార శైలిపై ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చొరవ తీసుకొని అతనిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - వంగర

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని ఎం సీతారాంపురంలో హైదరాబాదుకు చెందిన భారత డైనమిక్స్ లిమిటెడ్, డిఆర్‌డిఏ సంయుక్తంగా నిర్వహిస్తున్న మహిళల టైలరింగ్ శిక్షణ కేంద్రంలో మూడు నెలలపాటు శిక్షణ పొందిన మహిళలకు సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కొత్త బ్యాచ్‌కి వెల్కమ్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైలరింగ్‌తో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చునని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు యూనిట్లు నెలకొల్పేందుకు వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో రుణాలు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శన రావు, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి, ఎఫ్‌పిఒ ఎపిఎం గోవిందరావు, ఎంఎంఎస్ మండల అధ్యక్షులు కాంబోతుల భగవతి తదితరులు పాల్గొన్నారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నిరంతర విద్యార్థిలా నేర్చుకోవాలి : విసి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అధ్యాపకులు నిరంతరం విద్యార్థిలా ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకోవాలని వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్‌ఎన్ రాజు పిలుపునిచ్చారు. సోమవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఆయన అధ్యాపకులకు మృదువైన నైపుణ్యాల (సాఫ్ట్ స్కిల్స్) పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన అధ్యాపకులకు ఎలాంటి లక్షణాలు ఉండాలో పవర్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి ఒకరు మెదడుకి పదును పెడుతూ బోధనా పద్ధతులు మెరుగుపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. ఎస్. వర్మ, డీన్లు ప్రొఫెసర్ ఎం.లక్ష్మి నరసింహ ఆచార్యులు, రిటైర్డ్ ప్రొఫెసర్ శాంతమ్మ, ప్రొఫెసర్ మురళి, అసోసియేట్ డీన్ డాక్టర్ సన్నీ డియోల్, విభాగాదిపతి డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ జిఎస్‌ఎన్‌రాజు

స్థలాలున్నాయి.. ఇళ్లు కట్టించండి

ప్రజాశక్తి- వేపాడ

ప్రభుత్వ భూమి ఉంటే పేదలకు ఇల్లు కట్టిస్తామంటూ పలు సమావేశాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పదే పదే చెబుతున్నారే తప్ప పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఒకేచోట ప్రభుత్వ స్థలాన్ని చూపిస్తే అందరికీ ఇళ్లు కటించి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే ప్రతి సమావేశంలోనూ చెబుతున్నారు. అయితే వీలుపర్తి రెవెన్యూ పరిధిలో 200 ఎకరాల డిపట్టా భూమి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బోసు రాజు సాగులో ఉన్న విషయం ఎమ్మెల్యేకు, రెవెన్యూ అధికారులకు తెలియదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. చామలాపల్లి రెవెన్యూ పరిధిలో వెంకయ్య పాలెం వద్ద ప్రభుత్వం ఎస్‌సిలకు కొని ఇచ్చిన 24 ఎకరాలు విశాఖకు చెందిన కట్టా కాశీ విశ్వనాథం చేతిలో ఉంది. ఈ విషయం తహశీల్దార్, ఎమ్మెల్యేయకు తెలియదా అని అడుగుతున్నారు. వందలాది ఎకరాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి దర్జాగా అనుభవిస్తున్నా పట్టించుకోని యంత్రాంగం పేదలకు ఇళ్లు కట్టడానికి మాత్రం జాగాలేదని చెప్పడం విడ్డూరంగా ఉందని పలువురు ఆక్షేపిస్తున్నారు. కబ్జాల కోరల్లో ఉన్న ప్రభుత్వ భూములను సేకరించి పేదలకు ఇళ్లు కట్టి ఇవ్వాలని ఇళ్లు లేని నిరుపేదలు డిమాండ్ చేస్తున్నారు.

144 కేజీల గంజాయి పట్టివేత

శృంగవరపుకోట: మండలంలోని వివిధ కేసులలో 144 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సింహాద్రి నాయుడు సోమవారం తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. బొడ్డవర చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రంగారెడ్డి జిల్లా హైదరాబాదుకు చెందిన మోహిత్ కుమార్ అరకులో ఒక కేజీ గంజాయి కొనుగోలు చేసి ఆటోలో వస్తుండగా పోలీసులను చూసి ఆటోలోంచి పారిపోయేందుకు ప్రయత్నించగా అతని పట్టుకోగా ఒక కేజీ గంజాయి లభించిందన్నారు. విశాఖకు చెందిన సాయిరాం, వీరస్వామి, నితీష్ అనే ముగ్గురు వ్యక్తులు ఒడిస్సా రాష్ట్రం చట్టువ వద్ద 60 కేజీల గంజాయిని కొనుగోలు చేసి హై 20 కారులో తరలిస్తూ వాహన తనిఖీలలో పట్టుబడ్డారు. కేరళ రాష్ట్రానికి చెందిన లిశాంత్ కె.పి అనే వ్యక్తి టాటా సఫారీలో 83 కేజీల గంజాయి తరలిస్తుండగా బొడ్డ వర చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలలో పట్టుపడ్డారు. ఈ ఐదుగురుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై తారకేశ్వరరావు, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.


పట్టుబడిన నిందితులతో పోలీసులు

నేడు వాహనాల వేలం

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో మంగళవారం వాహనాల వేలం పాట వేయనున్నట్లు ఎస్ఇబి సిఐ జైభీమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శైలజా రాణి ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఔత్సాహికులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.